06ATP27.qxd:06ATP27.qxd 09/10/22 9:48 PM Page 1



## వైభవంగా శ్రీ లక్ష్మినరసింహుని ప్రాకారోత్సవం

-శ్రీ లక్ష్మినరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు

-శ్రీవారిని దర్శించుకున్న మునిరత్నం శ్రీనివాసులు


శ్రీవారి ప్రాకారోత్సవ దృశ్యం

**ఉరవకొండ, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ శుభకృత్ నామ సంవత్సరం అశ్వీయుజ చతుర్ధశి శనివారం సాయంత్రం శ్రీవారి ప్రాకారోత్సవం కన్నుల పండువగా వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీరి్చన అనంతరం ప్రధానాలయం చుట్టూ ప్రదీక్షిణలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు కొండపైన శ్రీవారిని కొండకింద శ్రీ ఉద్భవలక్ష్మి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి తలనీలాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకోగా భక్తులకు ప్రసాదం పంపిణీ నిర్వహించారు. కాగా అనంతపురానికి చెందిన మునిరత్నం శ్రీనివాసులు దంపతులు శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు శాలువాకప్పి సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ యం.అశోక్‌కుమార్, కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, అర్చకులు ద్వారకనాధాచార్యులు, గుండుస్వామి, బాలాజీచార్ సిబ్బంది పాల్గొన్నారు.

## పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

-చోళసముద్రం గడప గడపకు మన ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకొంటున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ, అక్టోబర్ 8 ప్రభాత వార్త :** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని కూడేరు మండలం చోళసముద్రం గ్రామంలో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గడప గడపకు వెళ్లి గడిచిన మూడేళ్లలో వైసీపీ ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష టీడీపీ అధినేత చంద్రబాబు తన పార్టీ ఉనికిని కాపాడుకోవడానికి ప్రభుత్వంపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరుగకపోతే ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యే పరిస్థితులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహార్ధశ..!

- రూ.2.64 కోట్లతో పీఏబీఆర్ వరకు బీటీ రోడ్డుకు భూమిపూజ


రాకెట్లలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైసీపీ యువనేత వై.ప్రణయ్‌రెడ్డి

**ఉరవకొండ, అక్టోబర్ 8 ప్రభాత వార్త :** ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్లకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని వైసీపీ యువనేత వై.ప్రణయ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో శనివారం ఆయన రాకెట్ల నుండి రాకెట్ల తండా మీదుగా పీఏబీఆర్ వరకు 2.64 కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి శంకుస్థాపన అనంతరం జేసీబీతో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తండా వాసులు బీటీ రోడ్డు కావాలని అడుగుతు న్నారని వారి కలను నేడు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సాకారం చేస్తున్నారన్నారు. రోడ్డు పూర్తీ అయితే రాకెట్ల, రాకెట్ల తండా, ఆమిద్యాల, నింబగల్లు తదితర గ్రామాల ప్రజలకు అనంత పురం వెళ్లే సమయం తగ్గుతుందన్నారు. రోడ్డు నిర్మాణం నాణ్యతా ప్రమాణా లకు అనుగుణంగా పూర్తీ చేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో గ్రామసర్పంచ్ డి.శివమ్మ, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, వైస్ ఎంపీపీ యం.నరసింహులు, పెన్నహోబిళం దేవస్థా నకమిటీఛైర్మెన్ యం.అశోక్ కుమార్, ఎంపీటీసీ సాలమ్మ, ఆమిద్యాల పీఏసీఎస్ ఛైర్మెన్ బి.తేజోనాథ్, వైసీపీ పట్టణఅధ్యక్షు డు సి.ఓబులేసు, ఉరవకొండ ఉప సర్పంచ్ జి.వన్నప్ప, ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జోగి వెంకటేష్, లత్తవరం సర్పంచ్ పి.వంశీకృష్ణ, మోపిడి సర్పంచ్ సిద్దప్ప, ఆమిద్యాల సర్పంచ్ శ్రీరాములు, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి, మాజీ జెడ్పీటీసీ ఎస్.తిప్పయ్య, నాయకులు దయ్యాల నాగరాజు, యం.బసవరాజు, ఆమిద్యాల రాజేష్, పెన్నయ్య, శీనా నాయక్, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటర్లు నమోదు చేసుకోండి

- టీడీపీ పట్టభద్రుల అభ్యర్థికి పట్టం కట్టండి

- రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు

**అగళి,అక్టోబర్ 8ప్రభాతవార్త :** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి హాజరై ప్రసంగించారు. గ్రామాల్లో పట్టభద్రులుగా ఉన్నవారు, ఇతర ప్రాంతాల్లో పట్టభద్రులైన వారు 2019 సంవత్సరంలో డిగ్రీ,డిప్లమో, ఇంజినీరింగ్, పిజికోర్సులు పూర్తిచేసుకున్న వారు. పట్టభద్రుల ఓటరు నమోదు చేసుకోవాలని వారికి సంబంధించిన ర్టిఫికెట్లతోపాటు ఓటర్ ఐడి, ఆధార్‌కార్డు, ఒక ఫోటోతో గెజిటెడ్ అధికా రులతో సంతకం చేయించి తహాశీల్దారు కార్యాలయంలోగానీ, ఆన్‌లైన్‌లోగానీ దరఖాస్తు చేసుకోవాలన్నా రు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ.. గత మూడున్నర సంవతసరాలుగా వైఎస్ఆర్ పార్టీ ప్రభుత్వం అన్ని రకాలుగా విఫలమైందని, ఒకపక్క ధరలను పెంచి పేదల నడ్డి విరచడం, మూడు రాజధానుల పేరిట మభ్య పెట్టడం, ఎన్నికల్లో హామీలను తుంగలో తొక్కడం, అభివృద్ధి కానరాక పోవడం తదితర కారణాల వల్ల వైఎస్ఆర్ పార్టీకి స్వస్థి పలకాల్సిన సమయం ఆసన్నమైందని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా తెలుగు దేశం పార్టీ తరుపున భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి పోటీ చేస్తున్నారని అతన్ని అత్యధిక మెజార్టీతో పట్టభద్రులు పట్టం కడితే రాబోవు అసెంబ్లీ ఎన్నికలకు ఇది రెఫరెండమ్ అవుతుందని కచ్చితంగా ఈ ఎన్నికల్లో యువత ఉత్సాహంగా ఓట్లు వేసి గెలిపించాలన్నా రు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగు దేశం పార్టీ కార్యదర్శి శ్రీనివాసమూర్తి, కన్వీనర్ కుమారస్వామి, జడ్పిటిసి ఉమేష్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సుబ్బరాయుడు, పట్టభద్రుల నియోజకవర్గ కోఆర్డినేటర్ రామకృష్ణ, అరె సముద్రం గౌడ, మాజీ కన్వీనర్లు, మాజీ ఎంపిపిలు, మాజీ సర్పంచులు, తెలుగు దేశం పార్టీ నాయకులు హాజరయ్యారు.

## టీడీపీ నేతను పరామర్శించిన పరిటాల సునీత


టీడీపీ నేతను పరామర్శిస్తున్న పరిటాల సునీత

**రామగిరి, అక్టోబర్ 8 ప్రభాత వార్త :** రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం నసనకోట పంచాయితీ ముత్యాలపల్లి గ్రామానికి చెందిన సీనియర్ తెలుగు దేశం పార్టీ నాయకుడు, పరిటాల కుటుంబానికి సన్నిహితులు డీలర్ నారాయణప్ప, ప్రమాదంలో గాయపడి, అనంతపురం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, రామగిరి మండల మాజీ ఎంపిపి, హిందూపురం పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు బడుముద్దల రంగయ్యతో కలిసి వెళ్లి మాజీ మంత్రి పరిటాల సునీత పరామర్శించారు.

## భారత్‌జోడో యాత్రలో పాల్గొన్న హెచ్‌వి వెంకటేష్



భారత్ జోడో పాదయాత్రలో రాహుల్ గాంధీతో కలిసి నడుస్తున్న హెచ్.వి.వెంకటేష్

**పావగడ, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** ఏఐసిసి నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్‌జోడో పాదయాత్ర శనివారం కర్ణాటకలోని తుమకూర్ జిల్లాలోకి ప్రవేశించింది. ఈ పాదయాత్రలో రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ పావగడ బ్లాక్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షులు హెచ్.వి.వెంకటేష్‌ను ప్రత్యేకంగా పిలిచి మాట్లాడటంతో పావగడ కాంగ్రెస్ పార్టీ నాయకుల్లోను, కార్యకర్తల్లోనూ నూతన ఉత్సాహాన్నిచ్చింది. హెచ్.వి.వెంకటేష్ రాహుల్ గాంధీతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన వారికి పరామర్శ


గాయపడిన వారిని పరామర్శిస్తున్న రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు

**అగళి, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** ఇటీవల రోడ్డు ప్రామదానికి గురై చికిత్స అనంతరం తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న అగళి చాకలి మోహన్‌ను పరామర్శించారు. ప్రమాదంలో కాలు విరిగిన విషయాన్ని అడిగి తెలుసుకుని ధైర్యం నూరి పోశారు. అదే విధంగా కెంకెర గ్రామానికి చెందిన రాజన్న అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి వచ్చి విశ్రాంతి తీసుకుంటుండగా వారిని పరామర్శించారు. వీరి వెంట రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఘనంగా వీరభద్రస్వామి రథోత్సవం


వీరభద్రస్వామిని అలంకరించిన దృశ్యం

**అగళి, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పురాతన వీరభద్ర స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి మూల విరాట్‌ను వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించడంతోపాటు ప్రత్యేకంగా ధాన్యాలతో కూడా అలంకారం చేశారు. రథంపై వీరభద్రస్వామి ఉత్సవ విగ్రహాలను అందులో ఏర్పాటు చేసి దేవాలయం నుంచి పుర వీధుల గుండా రథాన్ని లాగారు. రాత్రి నుంచి తెల్లవారుజామున 6 గంటలకు రథోత్సవం పూర్తి అవుతుంది. ఈ రథోత్సవ కార్యక్రమానికి అగళి మండలం నుంచే కాకుండా మడకశిర నియోజకవర్గం నుంచి కర్ణాటక రాష్ట్రం తుమకూరు, శిర, కొరటిగెర, మధుగిరి తదితర ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరై రథంపై వాళ్ల కోరికల మేరకు పూలను చల్లడం ఆనవాయితీ. పెద్ద ఎత్తున రథంపై పూల హారాలను భక్తులు వేసి రథాన్ని లాగుతారు. రథాన్ని లాగడానికి పోటీ పడతారు. ఈ రథోత్సవంలో పాల్గొంటే అంతా మంచే జరిగి అభివృద్ధి చెందుతామని, దీర్ఘకాలిక రోగాలు నయం అవుతాయని, వివాహాలు కాని వారికి వివాహాలు జరుగుతాయని, రథోత్సవం అగ్నిగుండంలో పాల్గొంటే సంవత్సరం పొడవునా తమకు మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. వీరభద్రస్వామి అగ్నిగుండం రథోత్సవ కార్యక్రమం ధర్మకర్త రాజారావు, యజమానురాలు సిద్దగంగమ్మ, 12 కైవాడస్తుల ఆధ్వర్యంలో జరిగింది.

## నేడు గుట్టూరులో బాదుడే బాదుడు


మండల పార్టీ కన్వీనర్ సిద్దయ్య

**పెనుకొండ, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుట్టూరులో నేడు (ఆదివారం) బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలుగు దేశం పార్టీ మండల కన్వీనర్ సిద్దయ్య తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు బికె.పార్థసారధి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## స్పోర్ట్స్ చైర్మన్‌తో వైకాపా నాయకులు


భైరెడ్డి సిద్ధార్థరెడ్డిని కలిసిన వైకాపా నాయకులు

**అమరాపురం, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** సమీప కర్నాటక ఆంధ్రప్రదేశ్ వైసీపీ యువజన అధ్యక్షులు రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ భైరెడ్డి సిద్ధార్థరెడ్డిని స్థానిక వైకాపా నాయకులు గాలి దానేగౌడ్ తదితరులు కలిసారు. ఈ సందర్భంగా అమరాపురం సమీపంలోనున్న పావగడకు విచ్చేసిన యూత్ అధ్యక్షులను మర్యాద పూర్వకంగా కలిసి యువకుల యొక్క సమస్యలను వివరించినట్లు ఆయనతెలిపారు.

## టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా వై.చిన్నరాయుడు


వై.చిన్నరాయుడు

**ఉరవకొండ, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ లీగల్ సెట్ ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా మండల పరిధిలోని వెలిగొండ గ్రామానికి చెందిన వై.చిన్నరాయుడు నియమితులయ్యారు. శనివారం ఈమేరకు పార్టీ అనంతపురం పార్లమెంటు అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు ఉత్తర్వులు వెలువరించారు. ఈ సందర్భంగా వై.చిన్నరాయుడు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మెన్ పయ్యావుల కేశవ్, జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా నేత పయ్యావుల శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతను అంతఃకరణ శుద్ధితో నిర్వహిస్తానని పేర్కొన్నారు.

## పొలం ఆక్రమించుకోవడానికి ధౌర్జన్యం చేస్తున్నారు

- న్యాయం చేయాలని బాధిత రైతు కోగిరి గంగమ్మ

భర్త అంజినప్పలు స్టేషన్‌లో ఫిర్యాదు

**రొద్దం, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** కోగిరి గ్రామ పొలం సర్వేనెంబర్ 79, 4-07సెంట్ల పైకి రెండు ఎకరాల భూమిని ఏళ్లుగా తనభర్త అంజినప్ప సాగు చేస్తున్నామని.. పై రెండు ఎకరాల భూమిలో బోరు వేయించుకుని.. విద్యుత్ మీటరు ఏర్పాటు చేయించుకుని, జామచెట్లు, నేరేడు చెట్లు, చింత చెట్లు, కొబ్బరి చెట్లు సపోట చెట్లు సాగు చేసుకుంటున్నామని అంజినప్ప భార్య గంగమ్మ లు తెలిపారు. అయితే పై సర్వేనెంబర్ పైకి రెండు ఎకరాల భూమి పొలంలో పెంచుకుంటున్న చెట్లకు నీరు పెడుతుండగా అదే గ్రామానికి చెందిన గంగాద్రి, అంజినప్ప, నరసమ్మ, నరసింహులు ధౌర్జన్యం గా తన భర్త అంజినప్ప అడ్డుకుని నానా దుర్భాలాడుతున్నారని.. పొలం మాది పొలంలోకి వస్తే చంపుతామని బెదిరిస్తున్నారని.. విచారించి న్యాయం చేయాలని బాధిత రైతు అంజినప్ప, భార్య గంగమ్మలు శనివారం రొద్దం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు పోలీసులు స్పందించి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని చెప్పినట్లు తెలిపారు.

## వైకాపా సంయుక్త కార్యదర్శి వాగేష్

**అమరాపురం, అక్టోబర్ 08 ప్రభాతవార్త :** రాబోవు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేయటానికి పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్ తెలిపారు. మండలంలోని గ్రాడ్యుయేట్స్ ఓటరు నమోదును స్థానిక తహాశీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయంలో అందజేసి తమ ఓటును నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా తరుపున పోటీ చేయుచున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి ప్రతి వైకాపా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

## భర్త హత్య కేసులో భార్యతో పాటు ప్రియుడు అరెస్ట్


నిందితులను అరెస్ట్ చేసిన దృశ్యం

**గుత్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** పట్టణంలోని చెర్లోపల్లికాలనీలో నివాసం వుంటున్న ఈశ్వర్‌నాయక్ అనే జీపు డ్రైవర్ హత్యకేసులో నిందితులైన భార్య ఉమాదేవితో పాటు ఆమె ప్రియుని న్ని అరెస్ట్ చేసినట్లు సిఐ వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం అర బ్బన్ పోలీసుసర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించా రు. ప్రైవేటు జీపు డ్రైవర్‌గా పనిచేస్తున్న ఈశ్వర్‌నాయక్‌తో ఉమాదేవికి వివాహం జరిగిందన్నారు. ఆమె ప్రభుత్వాసుపత్రిలో కాంట్రాక్ట్ పద్దతిన సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న కృష్ణ అలియాస్ కిట్టతో వివాహే తర సంబంధం కొనసాగించిందన్నారు. ఈ వ్యవహారం తెలిసి పలుమార్లు ఈశ్వర్‌నాయక్ భార్యను మందలించాడన్నారు. అయితే తమ వివాహేతర సంబంధానికి భర్త అడ్డురాకూడదన్న దురాలోచనతో భర్తను హత్య చేసేందుకు ప్రియునితో పతకం రచించిందన్నారు. ఈ నెల 2న ప్రియుని సహకారంతో భర్త ఈశ్వర్‌నాయక్ తినే భోజనంలో విషపుగుళికలు కలిపిందన్నారు. అతను మద్యం మత్తుతో పాటు విషపుగుళికల ప్రభావంతో అతను అపస్మారకస్థితిలో వుండగా రోకలిబండతో బాదిందన్నారు. తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి అతని గాయాల పట్ల కట్టుకథ అల్లిందన్నారు. అతను చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందాడన్నారు. ఈ వ్యవహారంలో దర్యాప్తు నిర్వహించి భార్య ఉమాదేవి, ఆమె ప్రియుడు కృష్ణను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమా ండ్‌కు ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, ఎఎస్ఐలు మాణిక్యం, ఆజాద్, తదితరులు పాల్గొన్నారు.

## బారికేడ్ల ఏర్పాటు


బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

**గుత్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రధాన 44వ జాతీయ రహదారిపై ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువ కావడంతో సిఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పలు చోట్ల డివైడర్లు వుండడంతో వాహనచోద కులు అతివేగంగా రోడ్డు దాటు తుండగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమా దాలు నివారించేందుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. పట్టణం లోని ఎన్‌టిఆర్ సర్కిల్, రాజీవ్ సర్కిల్, గాంధీచౌక్, తదితర ప్రాంతాల్లో డివైడర్ల రూపానా ఖాళీగా వున్న రహదారినడుమ బారికేడ్లు ఏర్పాటుచేశారు. దీంతో వాహనచోదకులు ఇష్టానుసారంగా రోడ్డు క్రాస్ చేసేందుకు వీలులేకుండా ప్రమాదాలు నివారించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రూ.కోటితో కస్తూరిబా పాఠశాల నూతన భవన నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజలో జెడ్‌పిటిసి పాలె జయరాంనాయక్

**గోరంట్ల, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** మండ లంలోని కాజాపురం గ్రామం వద్ద గల కస్తూరి బా స్కూల్‌లో నాడు - నేడు పథకం కింద కోటి రూపాయల నిధులతో నూతన భవనం నిర్మాణానికి నాంది పలికారు. ఈ కార్యక్రమానికి మండల జెడ్‌పిటిసి పాలె జయరాంనాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సౌజన్య, సిబ్బంది నేతృత్వంలో పాఠశాల ఆవరణలో భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. అనంతరం జెడ్‌పిటిసి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్‌నారాయణ చొరవతో నిధులు మంజూరయ్యాయని పేద విద్యార్థులకు చదువుకోవడానికి చాలా ఉపయోగకరమైన పాఠశాలగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. నిధుల మంజూరుకు సహకరించిన స్థానిక ఎమ్మెల్యేకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## పుట్టపర్తిలో వాలీబాల్ పోటీలు ప్రారంభం

**పుట్టపర్తిటౌన్, అక్టోబర్ 08, ప్రభాతవార్త :** పట్టణంలోని సాయినగర్‌లో జి.కిష్టప్ప వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. శనివారం ఈ పోటీలను యూత్ నాయకులు రామలక్ష్మణ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ పోటీలలో పాల్గొనడానికి ఉమ్మడి జిల్లాల నుండి 22 టీమ్‌లు పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. మొదటి రోజు పుట్టపర్తి, అగళి, శ్రీరంగరాజుపల్లి, అనంతపురం జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.7 వేలు, మూడవ బహుమతి 4 వేలు, నాలుగవ బహుమతి రూ.2 వేలను అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ వెంకటేష్ నాయక్, కౌన్సిలర్లు సాయిగీత, చెరువు భాస్కర్ రెడ్డి, నాయకులు పుట్ల గంగాద్రి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## రంగులు మార్చిన రంగడు.. నిత్యపెళ్లికొడుకుగా నాలుగు పెళ్లిళ్లు

- విచారణకు వచ్చి పోలీసుస్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నిత్యపెళ్లికొడుకు రంగప్ప

**గోరంట్ల, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** తాను చేసేది డ్రైవర్ ఉద్యోగం కావడంతో అనేక ప్రాంతాలు తిరుగుతూ అనేక మంది ఆడపిల్లలకు మాయమాటలు చెప్పి తన అసలు రూపాన్ని మరుగునపెట్టి రంగులు మార్చుతూ నిత్య పెళ్లికొడుకుగా తయారై నాలుగుపెళ్లిళ్లు చేసుకున్నాడు వడ్డె రంగప్ప. గోరంట్ల మండలంలోని బూదిలివాండ్లపల్లి గ్రామానికి చెందిన వడ్డె నరసింహులు కుమారుడు రంగప్ప కొంతకాలంగా డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. అయితే ఈ నేపథ్యంలో విధి నిర్వహణలో పలు ప్రాంతాలు తిరుగుతూ ఆయా ప్రాంతాల్లో మాయమాటలు చెప్పి మహిళలను లోబరుచుకుని వివాహం చేసుకుంటూ నిత్యపెళ్లికొడుకుగా మారాడు. ఈ సంఘటనపై ఇద్దరు భార్యల మధ్య జరిగిన వివాదం కారణంగా శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌కు వచ్చారు. అయితే పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయకనే నిత్య పెళ్లికొడుకు రంగప్ప స్టేషన్‌ఎదుట ఒక వీధిసందులో క్రిమిసంహారకమందు సేవించాడు. అది గమనించిన స్థానికులు హుటావుటిన అతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రంగప్ప మొదటి భార్య శివమ్మ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రంగప్పకు 2010లో శివమ్మతో వివాహమై దివ్య, పృధ్విరాజ్ అనే పిల్లలు వున్నారు. వీరిది చిలమత్తూరు మండలంలోని సాములపల్లి గ్రామం. అయితే పెళ్లి అయిన కొద్దిరోజుల తరువాత బయట తిరుగుతూ గుట్టుచప్పుడు కాకుండా బెంగుళూరుకు చెందిన దీపిక అనే మహిళతో, హిందూపురంకు చెందిన కృప అనే మహిళతో, అలాగే మడకశిరకు చెందిన ఆశ అనే మహిళతో నాల్గవ వివాహం చేసుకున్నాడని ఆమె తెలిపింది. ఎక్కడ పెళ్లి చేసుకున్నా ఆ వ్యక్తి నాకు తల్లిదండ్రులు లేరని వారు ఎప్పుడో చనిపోయారని ఇతరుల సమాధుల ఫోటోలు చూపించి నమ్మబలికి నాకు ఇతర ప్రాంతాల్లో ఆస్తులతో పాటు వాహనాలు వున్నాయని నమ్మించి వివాహాలు చేసుకున్నాడని ఆమె ఆరోపించింది. ఈ సంఘటనపై పోలీసులు ఎలాంటి విచారణ చేయకముందే రంగప్ప ఆత్మహత్యకు పాల్పడడం పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాల్సి వుంది.

## కొల్లాపురమ్మ అమ్మవారి దేవాలయ నిర్మాణానికి టైల్స్ వితరణ


గుడి కొరకు గ్రానైట్ టైల్స్ అందిస్తున్న సామకోటి ఆదినారాయణ

**పుట్టపర్తిరూరల్, అక్టోబర్ 08, ప్రభాత వార్త :** శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని కొత్తచెరువు మండల కేంద్రంలో బిసి కాలనీ నందు కొలువైన కొల్లాపురమ్మ దేవాలయ నిర్మాణానికి జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఫ్లోరింగ్ గ్రానైట్ టైల్స్‌ను వితరణగా అందించారు. ఈ మేరకు శనివారం సామకోటి ఆదినారాయణ స్వగృహం వద్ద గుడి పూజారి అయినటువంటి వలిపి కుమార్‌కు వీటిని అందజేశారు. ఈసందర్భంగా సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ, కొల్లాపురమ్మ అమ్మవారి గుడికి గ్రానైట్‌ను బహూకరించడం చాలా ఆనందంగా ఉందని, ఇలాంటి సేవా కార్యక్రమాలను నావంతుగా శక్తికిమించి నిర్వహిస్తున్నానంటే అది భగవాన్ సత్యసాయి బాబా వారి దివ్యాశీస్సుల ద్వారానే సాధ్యమౌతున్నదన్నారు. ఇదేవిధంగా స్వామివారిఆశీస్సులు, అమ్మవారి కృపా కటాక్షాలు తమపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి నియోకవర్గ అధ్యక్షులు జయప్రకాష్, పుట్టపర్తి నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సాయిప్రసాద్, వాల్మీకి సుధాకర్, గంగాధర్, సురేష్‌బాబు, వెంకటరాముడు, హరి, చిన్నకృష్ణ, రమేష్, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు పుట్టపర్తిలో వాల్మీకి జయంతి

**పుట్టపర్తిటౌన్, అక్టోబర్ 08, ప్రభాతవార్త :** శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని సాయి అరామంలో మహర్షివాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షమ సాధికారిక అధికారి రాజకుల్లాయప్ప తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించి ఈ కార్యక్రమం ఉదయం 08:30 గంటలకు జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, శాసన సభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి లతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. అన్ని వర్గాల ప్రజలు సంబంధిత అధికారులు పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ప్రభుత్వం స్పందించి గ్రామాలకు తారురోడ్డు వేయాలి - జనసేన


నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

**చిలమత్తూరు, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** మండలంలోని శెట్టిపల్లి పంచాయతీలోని కమ్మయ్యగారిపల్లి, కమ్మయ్యగారిపల్లి తాండాకు ప్రభుత్వం తారురోడ్డు వేయాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జనసేన పార్టీ హిందూపురం ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్ ఆదేశాల మేరకు జనసేన నాయకులు ఆయా గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ శెట్టిపల్లి పంచాయతీలోని అనేక గ్రామాల్లో అభివృద్ధి శూన్యమన్నారు. ఆయా గ్రామాలకు రహదారులకు లేకపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు అత్యవసర పరిస్థితుల్లో మండల కేంద్రానికి రావాలంటే కనీసం అంబులెన్స్ కానీ ఆటో గానీ మోటర్‌సైకిల్ గాని రావడానికి కూడా సరైన దారి లేక గ్రామస్తులు ఎన్నో అవస్తలు పడుతున్నారన్నారు. గ్రామస్తులు, స్కూల్ పిల్లలు సచివాలయం వెళ్లాలన్నా, పాఠశాలలకు వెళ్లాలన్నా రెండు కిలోమీటర్లు శెట్టిపల్లికి గుంతలమయమైన రోడ్డులో వెళ్లకుండా హైవే మీదుగా కోడూరు మీదుగా 12 కిలోమీటర్లు చుట్టుకుని వెళ్లాల్సి వస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా అభివృద్ధి మాత్రం వెనుకబడి వుందని నాయకులు ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయా గ్రామాలకు వెంటనే తారురోడ్డు వేయాలని జనసేన పార్టీ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎవి రమణ, చిలమత్తూరు మండల అధ్యక్షులు చిన్నప్రవీణ్, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు అగ్గి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణమూర్తి, మనోహార్, కార్యదర్శులు రంగనాథ్, మనోహార్, కృష్ణమూర్తి, ధర్మేంద్ర, జనసేన నాయకులు సోము, జగదీష్, నవీన్, వెంకటేష్, నరేష్, సాయికుమార్, కార్తీక్‌నాయక్, ఆదర్శ్‌రెడ్డి, గంగాధర్, గ్రామస్తులు లక్ష్మినారాయణరెడ్డి, శివప్ప, అంజినరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, జయరాం, అనిల్‌కుమార్‌నాయక్, సాయితేజనాయక్, తిప్పిబాబు, మంగలిబాయి, శశికళ, కళావతిబాయి, తదితరులు పాల్గొన్నారు.


వర్షం నీటిలో వెలుతున్న దృశ్యం

# ఖాద్రీశుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

## ఖాద్రీశుని దర్శనానికి బారులు తీరిన భక్తులు



**కదిరి టౌన్, అక్టోబర్ 8, ప్రభాతవార్త**

ప్రముఖ ప్రసిద్ధిగాంచిన లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి శనివారం భక్తాదులు పోటెత్తారు. శ్రీదేవి, భూదేవి సమేతుడై వెలసిన స్వామి వారి దర్శనానికి తెల్లవారు జామునుండే భక్తులు బారులు తీరారు. నరసింహస్వామి కాపులు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తాదులు ఇంటి ఇలవేల్పుగా ఉన్న భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయి తిరుమాడ వీధులన్నీ నిండిపోయాయి. ముఖ్యంగా స్వామి వారికి భక్తాదులు తమ మొక్కుబడులను తలనీలాలను సమర్పించుకున్నారు. తులాభారం మొక్కుబడులను కూడా అధిక సంఖ్యలో తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ అతిసీఘ్ర, ప్రత్యేక, ఉచిత దర్శనాల క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తాదుల సౌకర్యార్థం దర్శనం అనంతరం నైవేద్యప్రసాదాల వితరణతో పాటు నిత్యాన్నదాన సత్రంలో భోజన వసతిని కల్పించారు.

# ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తీర్మాణం పంపాలి

**- ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రనాథ్**

**కదిరి టౌన్, అక్టోబర్ 8, ప్రభాతవార్త**

మాదిగల ఎస్సీ వర్గీకరణ అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం సుప్రీం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఎఫ్ నాయకులు

కోర్టుకు తీర్మాణం పంపాలని ఏంఈఎఫ్ జిలా ్ల ప్రధాన కార్యదర్శి నాగేంద్రనాథ్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా స్థానిక ఎంఈఎఫ్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్బ ంగా ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు జి ఆనంద్, నాగేంద్రనాథ్‌లు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరగడం ద్వారానే ఎస్సీ ఉపకులాలకు న్యాయం జరుగు తుందన్నారు. కావున ఏపి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నా మని మద్దతు తెలియపరుస్తూ సంబంధిత ప్రొసీడింగ్స్‌కు సుప్రీం కోర్టుకు పంపాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పిఎస్, ఎంఈఎఫ్ నాయకుల ఆధ్వర్యం లో రాజీలేని ఎన్నో ఉద్యమాలు, ఆందోళనలు చేస్తున్నప్పటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో చలనం లేకపోవడం వల్ల మాదిగలు తీవ్రంగా నష్టపోతున్నా రన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయకపోవడం వల్ల విద్య, వైద్య ఉపాధి రంగాల్లో తీవ్ర ఆటంకం కలిగి బంగారు భవిష్యత్తుకు అడ్డంకిగా మారుతోందన్నారు. ఈ సందర్భంలో ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ శ్రీనివాసరావు పొట్టిశ్రీరాములు జిల్లా నెల్లూరు విక్రమసింహపురి యూనివర్శిటి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టినందుకు ఎంఈఎఫ్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సమావేశంలో ఎంఈఎఫ్ నాయకులు శ్రీనివాసులు, నాగప్ప, పక్కీరప్ప, చిన్నప్పయ్య, మురళీకృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

# పోలీసులు పార్టీలకు అతీతంగా విధులు నిర్వహించాలి

**కదిరి టౌన్, అక్టోబర్ 8, ప్రభాతవార్త**

కదిరి పట్టణంలో పోలీసు అధికారులు పార్టీలకు అతీతంగా విధులు నిర్వహించాలని టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా బడుగు బలహీన వర్గాలకు చెందిన వారి సమస్యల పట్ల పారదర్శకంగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలా కాకుండా ఏకపక్షంగా వ్యవహరించడం పోలీసు అధికారులకు ఏమాత్రం సముచితం కాదని అతను హితవు పలికారు.



డైమండ్ ఇర్ఫాన్

# వెల్లుట్లలో అన్నదానం



మృతి చెందిన కోతులకు సమాధులు కట్టిన దృశ్యం



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**పుట్లూరు, అక్టోబర్ 8 ప్రభాతవార్త**

మండలంలోని వెల్లుట్ల గ్రామంలో శనివారం గ్రామస్తులు అన్నదాన కార్య క్రమాన్ని చేపట్టారు. గ్రామంలో గత పది రోజుల క్రితం విద్యుత్‌షాక్‌కు గురై రెండు కోతులు మృతి చెందాయి. గ్రామస్తులు ఆంజనేయస్వామి ప్రతిరూపమైన కోతులు మృతి చెందడంతో సమాధి కట్టి గుడిలాగా ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున గ్రామస్తులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి శనివారం ప్రత్యేక పూజలు చేసేలా ఏర్పాట్లు చేశామని గ్రామస్తులు తెలిపారు.

# సర్పంచుల అరెస్ట్ దారుణం

**యాడికి, అక్టోబర్ 8 ప్రభాతవార్త**

తమ సమస్యల పరిష్కారానికై పంచాయతీరాజ్ కమీషనర్‌కు వినతిపత్రం ఇవ్వ దానికి వెళ్లిన సర్పంచులను అరెస్ట్ చేయడం దారుణమని మాజీ ఎంపిపి, పంచాయితీరాజ్ ఛాంబర్ కార్యదర్శి వేలూరు రంగయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్ఆర్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఇంత వరకు సర్పంచుల ఖాతాలకు సంబంధించి ఒక్క పైసా వేయకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి చేయలేకపోతున్నారన్నారు. సర్పంచు ద్వారానే ఉపాధి హామి పథకం నిధులతో కొనసాగించాలని, సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థను పంచాయితీలోనే పాలన సాగించే విధంగా చేస్తూ 12 డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని తెలిపారు.

# నేడు శ్రీవారి కల్యాణోత్సవం, రథోత్సవం

**తాడిపత్రిఅర్బన్, అక్టోబర్ 8 ప్రభాతవార్త**



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న చైర్మన్ బాణా నాగేశ్వర్‌రెడ్డి, అర్చకులు మురళిస్వామి

పట్టణంలోని శ్రీ చింతల వేంకటరమణ స్వామి బ్రహోత్స వాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 9గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి వేదపండితులు మురళిస్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నారు. కల్యాణోత్సవం తరువాత మధ్యాహ్నం 3గంటలకు స్వామివారి రథోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించనున్నారు. స్వామివారి కల్యాణోత్సవానికి పెద్దఎత్తున భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను చైర్మన్ బాణా నాగేశ్వర్‌రెడ్డితో పాటు ఇఒ సుబ్రమణ్యం, అర్చకులు మురళిస్వామి పర్యవేక్షించారు.

# శివప్రసాద్‌నాయుడును సన్మానించిన గోవర్ధన్‌రాజు



శివప్రసాద్‌నాయుడును సన్మానిస్తున్న గోవర్ధన్‌రాజు, తదితరులు

**పుట్లూరు, అక్టోబర్ 8 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ బిసి సాధికారసమితి రా ష్ట్ర కన్వీనర్‌గా ఎన్నికైన శివప్రసాద్‌నాయుడు అలియాస్ గుట్టబాబును జిల్లా పాలేకార్ ఉపాధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకుడు గోవర్ధన్‌రాజు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్బంగా గుట్టబాబు మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకం వుంచి ఎంపిక చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నానన్నారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా టిడిపి బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్య క్రమంలో రంగయ్య, లింగమయ్య, నారాయణస్వామి, హరికుమార్, నాగరంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్‌సిపి మాజీ సమన్వయకర్త దారుణ హత్య



దారుణహత్యకు గురైన చౌళూరు రామక్రిష్ణారెడ్డి



చౌళూరు రామక్రిష్ణారెడ్డి (ఫైల్‌ఫోటో)

**హిందూపురం, అక్టోబర్ 8, ప్రభాతవార్త**

హిందూపురం నియోజకవర్గ వైఎస్ఆర్‌సిపి మాజీ సమన్వయకర్త చౌళూరు రామక్రిష్ణారెడ్డి శనివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. గ్రామం సమీపంలోని సొంతడాబా హోటల్‌లో పని ముగించుకొని సుమారు రాత్రి 8.30 వద్ద ఇంటిదగ్గరకు వచ్చి కారు దిగారు. కాపుగాచిన దుండగులు అన్నా అని పిలువగానే కారు దిగి వెనుక వైపు తిరుగగా వేట కొడవళ్ళతో మెడ, ముఖం, కాళ్లపై పై విచక్షణా రహితంగా నరికి పారిపోయారు. విషయం తెలుసుకున్న స్థానికులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో అతడు మృతి చెందాడు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవు

**నంబులపూలకుంట, అక్టోబర్ 8, ప్రభాతవార్త:**

వైద్య, ఆరోగ్యశాఖ మలేరియా అధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, వాతావరణ ప్రభావం వల్ల సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ప్రాథమిక వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఆసియా తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆశ వర్కర్లుకు, ఏఎన్‌యంలకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు ఏఎన్‌యంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొదటి బహుమతి కైవశం చేసుకున్న ఎస్‌బిఎస్ టీం



బహుమతులు అందచేస్తున్న వనం హరిప్రసాద్‌రెడ్డి

**అమడగూరు, అక్టోబర్ 8 ప్రభాతవార్త**

అమడగూరు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గత రెండు రోజులుగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన ఫైనల్‌మ్యాచ్‌లో ఎస్‌బిఎస్ టీం, ఐవిల్డ్ లయన్స్ పోటీపడగా మొదటి బహుమతిని ఎస్‌బిఎస్ టీం కైవశం చేసుకుంది. గెలుపొందిన జట్టుకు వైసిపి సీనియర్ నాయకులు వనం హరిప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా 14 వేల రూపాయల నగదు అందచేశారు. రెండవ బహుమతి 10 వేల రూపాయలను అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు షబ్బీర్, సద్దాం, బషీర్, జిరాక్స్ బాబు, సోమశేఖర్‌రెడ్డి, గంగులప్ప, శీను, శివ, మురళి, కరీముల్లా, చందు, శివ, మంజునాథ్, హరీష్, నాగార్జున, నవీన్, రామాంజులు, తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

# మల్లికార్జునఖర్గే పరంగా నాసీర్‌హుసేన్ ప్రచారం

**బళ్లారి, అక్టోబర్08, ప్రభాతవార్త ;**



మల్లికార్జునఖర్గే పరంగా మహారాష్ట్రలో ప్రచారసభలో ప్రసంగిస్తున్న ఎంపీ డా.సయ్యద్‌నాసీర్‌హుసేన్

ఏఐసీసీ అధ్యక్ష స్థానానికి పోటీచేసిన కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లికార్జునఖర్గే పరంగా బళ్లారికి చెందిన రాజ్యసభ సభ్యుడు డా.సయ్యద్‌నాసీర్‌హుసేన్ శనివారంనాడు మహారాష్ట్రలో జరిగిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. కర్ణాటకకు చెందిన ఖర్గే గెలుపు ఖాయమని, అయినా ఆయన గెలుపును హెచ్చు ఓట్ల ఆధిక్యతతో మనం చూడాల్సి ఉన్నదని, 50 సంవత్సరాలపాటు సుదీర్ఘకాలంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన ఖర్గేకు పార్టీ ఉన్నతస్థానం లభించడం సహజమని, ఆయన నేతృత్వంలో పార్టీ నాయకులైన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీల సలహా, సూచనలతో కాంగ్రెస్ పార్టీ సదృఢమవుతుందన్నారు. సభలో మల్లికార్జునఖర్గే, మహారాష్ట్ర పీసీసీ నాయకులు పాల్గొన్నారు.

# జోడో యాత్రపై కాంగ్రెస్‌శ్రేణుల విస్తృత ప్రచారం

**బళ్లారి, అక్టోబర్08, ప్రభాతవార్త ;**



ఇంటింటా కరపత్రాలు పంచుతూ రాహుల్ సభకు హాజరుకావాలని విజ్ఞప్తి చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఈనెల 15వ తేదీన రాహుల్‌గాంధీ నేతృత్వంలోని 'భారత్ జోడో' పాదయాత్ర బళ్లారికి చేరుకుంటున్నది. ఈ నేపథ్యంలో నగరంలోని మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో రాహుల్‌గాంధీ హాజరయ్యే బహిరంగసభ వేదిక సిద్ధమవుతున్నది. సుమారు 5 లక్షల మంది వరకు ఈ సభకు సమీకరించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. జోడోయాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రెండు, మూడు రోజులుగా నగరంలో కాంగ్రెస్ శ్రేణులు విస్తృత ప్రచార కార్యాన్ని చేపట్టాయి. జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో డీసీసీ అధ్యక్షుడు మహ్మద్‌రఫి, కేపీసీసీ ప్రధాన కార్యదర్శి జె.ఎస్.ఆంజనేయులు, నాయకులు ముండ్రగి నాగరాజ్, మేయర్ ఎం.రాజేశ్వరి, కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ వార్డుల కార్పొరేటర్లు, వివిధ విభాగాల కాంగ్రెస్ పదాధికారులు, వందలాది మంది కార్యకర్తలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తూ ప్రజలకు కరపత్రాలు పంచిపెడుతూ రాహుల్‌గాంధీ సభకు హాజరుకావాలని, 'భారత్‌జోడో యాత్ర'కు మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు. తమ ప్రచారానికి ప్రజల నుంచి కూడా చక్కటి స్పందన లభిస్తున్నట్లు తెలిపిన జె.ఎస్. ఆంజనేయులు కుటుంబ సమేతంగా రాహుల్ సభకు హాజరవుతామని, అనేకవర్గాల ప్రజలు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్రంలో అధికారం జరుపుతున్న బీజేపీవారు దేశంలో మత విద్వేషాలు తలెత్తేరీతిలో అశాంతిని సృష్టిస్తున్నారని ఆరోపించారు. అందుకే దేశంలో ఐక్యతను కల్పించేందుకు రాహుల్‌గాంధీ 'భారత్‌జోడో' పాదయాత్రను చేపట్టారన్నారు. బళ్లారిలో మాత్రమే భారీ బహిరంగసభ జరుగుతున్నదని, ఇందులో పాల్గొని బహిరంగసభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపమేయర్ మాలన్‌బి, కంటోన్మెంట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కార్పొరేటర్ పేరంవివేక్(విక్కి), కేపీసీసీ కో-ఆర్డినేటర్ బోయపాటి విష్ణు, జుబేర్‌మహ్మద్, పరశురామ్, చిన్నాయప్ప, ఎర్రిస్వామి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మంజుల, డీసీసీ కార్యదర్శి శోభాకాళింగ, డి.సునీత, ఎం.సి.కవిత, షమీమ్‌భాను, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు. శనివారంనాడు స్థానిక 37, 03, 06వ వార్డుల్లో ప్రచారం చేపట్టారు. ఇదే సందర్భంలో సీనియర్ నాయకులు అల్లంప్రశాంత్, మాజీ ఎమ్మెల్యే అనిల్‌లాడ్, కార్పొరేటర్ ఎం.ప్రభంజన్‌కుమార్, మహ్మద్ హర్షద్‌గనీ, రావూరు సునీల్, అలివేలు సురేష్, ప్రకాష్‌గౌడ, పర్విన్‌భాను తదితర వందలాది మంది పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చే అధికారం జగన్‌కు ఎవరిచ్చారు

**- రాష్టంలో రాక్షస పాలన - పుట్టిన ప్రతిబిడ్డకు జగన్ పేరు పెట్టాలనే జీఓ తెస్తారేమో..!**

**- ఏపీకి శనిలా దాపరించిన జగన్ - ఒక్క అవకాశం అన్నాడు..అందరినీ నిలువునా ముంచాడు**

**- రిలే దీక్షలో మాజీ మంత్రి పల్లె ధ్వజం**



సమావేశంలో మాట్లాడుతున్న పల్లె



కార్యకర్తలతో కలిసి ర్యాలీ వస్తున్న పల్లెరఘునాథరెడ్డి

**నల్లమాడ అక్టోబర్ 08 ప్రభాతవార్త**

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చే అధికారం జగన్‌కు ఎవరిచ్చారని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పును నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో మాజీ మంత్రితో పాటు 12మంది టీడీపీ నాయకులు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ రాష్టంలో రాక్షస పాలన కొనసాగుతోందని, ముఖ్యమంత్రి జగన్ రావనుడులాంటి రాక్షసుడని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పుట్టిన ప్రతి బిడ్డకు జగన్ పేరు పెట్టాలనే వైసీపీ ప్రభుత్వం జీఓ తెచ్చినా ఆశ్చర్య పోవాల్సిన అవసర ం ఉండదేమో అన్నారు. బీసీలకు రాజకీయ చైతన్యం తీసుకొచ్చిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరును కొనసాగించేవరకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిని అభివృద్ధి చేయలేని ముఖ్యమంత్రి జగన్ మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామనడం ఉట్టికెక్కలేనమ్మ..స్వర్గానికెక్కగలదా అన్న చందంగా ఉందన్నారు. రాజధాని అమరావతిని అభివృద్ది చేయకపోగా అక్కడి భూములను ఎకరా రూ.10కోట్లతో అమ్మాలని చూస్తున్నారని, రాజధాని కోసం రైతులిచ్చి భూములను అమ్మే హక్కు జగన్‌కు ఎవరిచ్చారని పల్లె ప్రశ్నించారు. ఒక్క అవకాశం ఇవ్వండంటూ పాదయాత్రలో ప్రజలపై ముద్దులు కురిపించిన జగన్, ఇప్పుడు పిడిగుద్దులతో అన్ని వర్గాల ప్రజలకు కోలుకోలేని విధంగా దెబ్బతీశారని ఆందోళన వ్యక్తం చేశారు.సంక్షేమ పథకాల పేరుతో నామమాత్రంగా ప్రజలకు చిల్లర డబ్బులు విదుల్చుతూ కోట్లు అందేసినట్లు గొప్పలు చెప్పుకోవడం ఒక్క జగన్‌కే చెల్లిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పుట్టపర్తి నియోజకవర్గంలో సమస్యలను పూర్తిగా విస్మరించారని, స్వలాభం కోసం హైదరాబాదు, బెంగళూరులో తన వ్యాపారాలపై దృష్టి పెట్టారన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో 195 చెరువులకు నీళ్లు ఇస్తామని ప్రతిపక్షంలో ఉండగా ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని గాలికి వదిలేశాడన్నారు. 195చెరువులు నీళ్లు ఇచ్చేవరకు టీడీపీ పోరాటం చేస్తుందని పల్లెరఘునాథరెడ్డి పేర్కొన్నారు. వైకాపా అధికారంలోకి భూకబ్జాల చరిత్ర మొదలైందన్నారు. జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ రైతుల పక్షమే అని పల్లె రఘునాథరెడ్డి అన్నారు. పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్, పంటనష్టపరిహారం అందించి ఆదుకున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, బీసలకు 90శాతం, ఇతరులకు 75శాతం సబ్సీడీతో డ్రిప్పు, స్ప్రింక్లర్లు, రైతు రథం పేరుతో ట్రాక్టర్లు, సబ్సీడీపై వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసినట్లు పల్లె గుర్తచేశారు. రైతులకు రూ. లక్షా యాభై వేలు పంటరుణం మాఫీ చేసింది కూడ చంద్రబాబే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రైతు భరోసా పేరుతో ముఖ్యమంత్రి జగన్ యేదాదికి కేవలం రూ.7,500 ఇస్తూ రైతులకు ఏదో ఉద్దరిస్తున్నట్లుగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్టంలో ప్రజలు సుఖశాంతులతో ఉండాలంటే వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని పల్లె కోరారు.వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలపై దాడులు, వేధింపులు అధికమయ్యాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సాధికారక జిల్లా అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ కన్వీనర్లు మైలే శంకర, విజయ్‌కుమార్, సర్పంచులు రమావత్ భారతి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ దొన్నికోట కేవవరెడ్డి, దుద్దుకుంట గెన్‌రెడ్డి, సలాంఖాన్, మైలేరామ చంద్ర, అబ్బాస్, చిట్టిబాల రాజారెడ్డి, శివారెడ్డి, బుట్టినాగభూషణం, బాల్‌రెడ్డి, చెన్నారెడ్డి, పాపారాయుడు, ప్రకాష్, మధుసూదన్‌రెడ్డి, పుట్లరవి, శ్రీరాములు, బాబావలి, అన్నం లక్ష్మనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖాద్రీశున్ని దర్శించుకున్న మంత్రి ఉషా శ్రీచరణ్, ఎంఎల్ఏ పి.వి.సిద్దారెడ్డి నాయకులు





